క్లుప్తంగా

బీకేఎంయూ జాతీయ మహా సభలను జయప్రదం చేయాలి



న్యూశాయంపేట: భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ మహాసభలను నవంబర్ 2నుంచి 5వరకు బీహార్ రాష్ట్ర రాజధాని పాట్నాలో నిర్వహించాలని ఢిల్లీలో జరిగిన కార్యవర్గ సమావేశం నిర్ణయించినట్లు జాతీయ కార్యవర్గసభ్యుడు వెంకట్రాములు తెలిపారు. ఈక్రమంలో మహాసభలను జయప్రదం చేయడానికి విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. హనుమకొండ బాలసముద్రంలోని కార్యాలయంలో గురువారం జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి సమావేశానికి జిల్లా అధ్యక్షుడు మంచాల తిరుపతి అధ్యక్షత వహించగా వెంకట్రాములు మాట్లాడారు. పోరాడి సాధించుకున్న జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు కేంద్రం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన వాగ్దానాల అమలులో విఫలమైందని విమర్శించారు. సమావేశంలో నాయకులు కర్రె భిక్షపతి, లింగారెడ్డి, కర్రె లక్ష్మణ్, రాజమణి, రాజయ్య, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకే చెరువులపై పూర్తి హక్కు



హసన్‌పర్తి: రాష్ట్ర వ్యాప్తంగా మత్స్యకారుల సొసైటీలు ఏర్పాటు చేసి చెరువులపై పూర్తి హక్కులు మత్స్యకారులకే కల్పించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. హసన్‌పర్తి పెద్ద చెరువులో సుమారు రూ.1.65 లక్షల విలువగల 3.22 లక్షల ఉచిత చేపపిల్లలను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా రాష్ట్రంలో మత్స్య సంపద భారీగా పెరిగిందని అన్నారు. ఇతర రాష్ట్రాలకు కూడా ఇక్కడి నుంచి చేపలు ఎగుమతి చేసుకునే స్థాయికి చేరినట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శివకుమార్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ప్రధాన కార్యదర్శి పెద్దమ్మ శ్రీనివాస్, సొసైటీ మాజీ అధ్యక్షుడు పిట్టల కుమారస్వామి, ఉపాధ్యక్షుడు పిట్టల జితేందర్, డైరెక్టర్లు రాజ్‌కుమార్, ఉపేందర్, వీరేశం, రాజేందర్, భిక్షపతి, సుధాకర్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్, మార్కెట్ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, చకిలం రాజేశ్వరరావు, నర్సింహరాములు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ అడ్మిషన్లపై విచారణ జరపాలి



కేయూ క్యాంపస్: పీహెచ్‌డీ అడ్మిషన్ల వ్యవహారంలో అవకతవకలు జరిగాయని, ఈక్రమంలో విచారణ జరిపించి బాధ్యులు వీసీ, రిజిస్ట్రార్లపై చర్యలు తీసుకోవాలని కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సభ్యుడు, బీఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ గుండాల మదన్‌కుమార్ డిమాండ్ చేశారు. కేయూలో విద్యార్థి జేఏసీ దీక్షల శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించి మాట్లాడారు. పీహెచ్‌డీ కేటగిరీ -1 అడ్మిషన్లలో 30శాతం రిజర్వేషన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు అడ్మిషన్లు ఇచ్చారని, దీంతో రెగ్యులర్ విద్యార్థులకు ఫెలోషిప్ కలిగిన వారికి అన్యాయం జరిగిందని వాపోయారు. పీహెచ్‌డీ కేటగిరీ -2లో ఇంటర్వ్యూలు పెట్టడం వలన కొంతమంది విద్యార్థులకు అన్యాయం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. దీక్షకు బీఎస్‌పీ వరంగల్ అధ్యక్షుడు మంద శ్యామ్, రాష్ట్ర నాయకులు మాదరపు రవికుమార్, బొట్ల కార్తీక్, చిత్రపు పుష్ప, ఎస్‌ఎస్‌యూ విద్యార్థి సంఘం బాధ్యులు మరపెల్లి మనోజ్, బీఎస్పీ నాయకులు బస్కె నాగరాజు సంఘీభావం తెలిపారు. విద్యార్థి జేఏసీ బాధ్యులు ఇట్టబోయిన తిరుపతి, మేడ రంజిత్ కుమార్, ఆరెగంటి నాగరాజు, మాచర్ల రాంబాబు, అంకెళ్ల శంకర్ పాల్గొన్నారు.

'పళని సేవాదళ్' అన్నదానం



హన్మకొండ కల్చరల్: పళని సేవాదళ్ ఆధ్వర్యంలో ప్రతి అమావాస్య నాడు (9.9.2018 నుంచి) క్రమం తప్పకుండా అన్నదానం నిర్వహిస్తున్నట్లు సేవాదళ్ అధ్యక్షుడు బొడ్ల రవీంద్రనాథ్ తెలిపారు. ఈమేరకు భద్రకాళి ఆర్చి వద్ద గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, పబ్బతి సత్యనారాయణ, ఉప్పుల అనిల్‌కుమార్, రవికుమార్, అరవింద్, వెంకటేశ్వర్లు, భాస్కర్, పడిశాల సుజాత, రమేష్‌చంద్, నూతన్ తదితరులు పాల్గొన్నారు. వేద పండితుడు దత్తు.. అరటి పండ్లు పంపిణీ చేశారు. అలాగే, కరీమాబాదులోని బొమ్మల గుడిలో గోమాత సేవ చేసి అన్నదానం చేశారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

నగరవ్యాప్తంగా పలు పాఠశాలల్లో హిందీ భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. లష్కర్‌బజార్ ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో విద్యార్థులకు హిందీ టీఎల్ఎం మేళాను నిర్వహించారు. విద్యార్థులు హిందీ భాషపై పట్టు సాధించాలని గాడిపెల్లి పాఠశాల హెచ్‌ఎం ప్రవీణ్‌కుమార్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శారదాబాయి సూచించారు. రంగశాయిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ నేతృత్వంలో, హసన్‌పర్తి సిద్దాపురం పాఠశాలలో, సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్లో హిందీ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు.

- సాక్షి నెట్‌వర్క్



లష్కర్‌బజార్ ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో హిందీ టీఎల్‌ఎం మేళాలో చార్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు



గాడిపల్లి పాఠశాలలో హిందీ మేళా ప్రదర్శనను పరిశీలిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శారద



హసన్‌పర్తి మండలం సిద్దాపురం పాఠశాలలో హిందీ చార్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



వరంగల్ రంగశాయిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ రమాదేవిని సన్మానిస్తున్న అధ్యాపకులు



సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో హిందీ భాష పితామహుడు మార్టిన్ హరీష్‌చంద్రకు నివాళి

రైతాంగ పోరాటానికి కమ్యూనిస్టులే వారసులు

హన్మకొండ: తెలంగాణ సాయుధ పోరాటానికి కమ్యూనిస్టులే వారసులని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు టీ.ఉప్పలయ్య అన్నారు. హనుమకొండ రాంనగర్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయంలో తెలంగాణ సాయుధ వార్షికోత్సవ సభను గురువారం నిర్వహించారు. అనంతరం సీపీఎం కార్యాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. వీరన్న, శివన్న, రాజు, లింగమూర్తి, రమాదేవి, ఉమ, భాగ్యలక్ష్మి, పావని పాల్గొన్నారు.

హన్మకొండ చౌరస్తా: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులని, ఈ పోరాటంతో సంబంధం లేని బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి అన్నారు. పెద్దమ్మగడ్డ నుంచి ప్రభుత్వ పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఉప్పలయ్య, భాస్కర్, శ్రీదేవి, స్వప్న, రజిత, అభిరాంరాజు, తీగల సుదన్, రాంబాబు, క్రాంతి, రమణచారి పాల్గొన్నారు.



ర్యాలీ తీస్తున్న సీపీఎం నాయకులు

18నుంచి గణపతి నవరాత్రోత్సవాలు



హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల దేవాలయంలో ఈనెల 18నుంచి 26వ తేదీ వరకు శ్రీ ఉత్తిష్ట గణపతి మహోత్సవాలు వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, నగర సీపీ రంగనాథ్‌ను ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ, ఈఓ వెంకటయ్య గురువారం కలిసి వేడుకల్లో పాల్గొనాలని కోరారు. ఈమేరకు వారికి ఆహ్వాన ప్రతికను అందజేశారు. అనంతరం గంగు ఉపేంద్రశర్మ మాట్లాడుతూ దేవాలయంలోని మూల మహాగణతికి తొమ్మిది రోజులు విశేష అలంకరణలు, ప్రతిరోజు గణపతి హోమం, రుద్రహోమాదులు, నిత్యాన్నప్రసాదాల వితరణ, తెలంగాణ భాష సాంస్కృతికశాఖ సౌజన్యంతో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

సంక్షిప్తంగా

అంగన్‌వాడీలపై బెదిరింపులు మానుకోవాలి

హన్మకొండ: అంగన్‌వాడీ టీచర్లపై బెదిరింపులు మానుకోవాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని గత నాలుగు రోజులుగా డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు.. హనుమకొండ సర్క్యూట్ హౌస్ రోడ్డులోని ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాగుల రమేష్ మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం.. సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి కుట్ర పన్నుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ధర్నాలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు టీ.రమాదేవి, సమ్మక్క, రాజేశ్వరి, బీ.హైమావతి, శ్రీలేఖ, వాణి, రజియా, అనసూయ, లచ్చమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్యానికి మేలు



కరీమాబాద్: చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బత్తిని రమాదేవి అన్నారు. 42వ డివిజన్ రంగశాయిపేట అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రోజు తీసుకునే ఆహారంలో కొర్రలు, రాగులు, సజ్జలు, సామలు వంటి చిరుధాన్యాలు ఉంటే షుగరు, బీపీ లాంటి దీర్ఘకాలిక వ్యాధులు రావని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ యశోద, ఆశ కార్యకర్త శ్రీదేవి, అంగన్‌వాడీ కమిటీ సభ్యులు చందన, శ్రీదేవి, అమీనా, మానస పాల్గొన్నారు.

బోడగుట్టలో పోషకాహార మాసోత్సవాలు

కాజీపేట రూరల్: కాజీపేట 47వ డివిజన్ బోడగుట్ట అంగన్‌వాడీ సెంటర్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాలు గురువారం జరిగాయి. ఈ సందర్భంగా పిల్లల తల్లులు, గర్భిణులు, మహిళలకు పోషకారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సంకు నర్సింగరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ జెరోష సృజన, బోడగుట్ట కాలనీవాసులు అఫ్జల్ పాషా, కుమార్, స్వర్ణలత, రఘోత్తంరెడ్డి, కిరణ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్ సత్యమ్మ పాల్గొన్నారు.

వీసీతో చర్చించి సమస్యను పరిష్కరించుకోవాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్లను వివాదాస్పదంగా చూపెడుతూ కొందరు ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నారని, అడ్మిషన్లలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా సక్రమంగానే జరిగాయని, ఏమైనా సమస్యలుంటే వీసీతో చర్చించి సమస్యను పరిష్కరించుకునేందుకు అవకాశం ఉందని కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం (కుక్టా) అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్ అన్నారు. కాకతీయ యూనివర్సిటీలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన సంఘం సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. సమావేశంలో సాయితరుణ్, అమరేందర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

విద్యారణ్యపురి: విద్యార్థులు వివిధ సబ్జెక్టుల విషయ పరిజ్ఞానంతోపాటు కార్పొరేట్‌కు సంబంధించిన నైపుణ్యాలు, కమ్యూనికేషన్స్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని హనుమకొండలోని కేడీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి కోరారు. కళాశాలలో కార్పొరేట్ నైపుణ్యాభివృద్ధిపై మూడు రోజులపాటు జరగనున్న వర్క్‌షాప్‌ను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యాలు ఉంటేనే రాణించగలుగుతారని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలువాల సంజీవయ్య, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్, టీఎస్‌కేసీ సమన్వకర్త లింగారెడ్డి, బాధ్యులు సత్యనారాయణ, రాజు, వేణుగోపాల్, సాగర్ పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

కరీమాబాద్: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం అన్నారు. వరంగల్ ఉర్సుగుట్ట తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్‌లో గురువారం విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించారు. ఈక్రమంలోనే హిందీ భాషా దినోత్సవాన్ని కూడా నిర్వహించారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణ, అన్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి



కాశిబుగ్గ: ఈనెల 18నుంచి 22వ తేదీ వరకు జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కాశిబుగ్గ జంక్షన్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం రెండో రోజు కొనసాగాయి. దీక్షకు పలువురు నాయకులు మద్దతు తెలిపారు. దీక్షలో ఈర్ల కుమార్, జన్ను మధుకర్, పూర్ణయ్య, రాధిక, రాజు, అరుణ్‌కుమార్ కూర్చున్నారు.

ఎయిడెడ్ టీచర్లను విలీనం చేయాలి

కాజీపేట రూరల్: ఎయిడెడ్ టీచర్లను ప్రభుత్వంలో విలీనం చేయాలని, 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని, ఇతర సదుపాయాలు కల్పించాలని ఎయిడెడ్ ఉపాధ్యాయుల జేఏసీ నాయకులు కోరారు. ఈమేరకు కాజీపేట దర్గాలో టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డిని బుధవారం రాత్రి కన్వీనర్ ఎంఏకే.తస్వీర్ ఆధ్వర్యంలో పలువురు కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కడారి భోగేశ్వర్, సోమేశ్వరరావు, బీ.రమేష్, శ్రీలత, రమాదేవి, బాలచారి, నజ్యోద్దీన్, అశోక్, పూర్ణచందర్, డీ.రమేష్ పాల్గొన్నారు.

తూర్పు నుంచి పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలి



వరంగల్: వరంగల్ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని ప్రముఖ న్యాయవాది అల్లం నాగరాజు కోరారు. ఈమేరకు జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను హైదరాబాద్‌లో గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికుడిగా, న్యాయవాది వృత్తిలో ఉంటూ పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్నానని చెప్పారు. బీసీ వర్గానికి చెందిన తనకు అవకాశం కల్పించాలని అభ్యర్థించారు.

రంగనాథస్వామి దేవాలయంలో చండీహోమం

కాశిబుగ్గ: అమావాస్యను పురస్కరించుకుని గురువారం వరంగల్ కాశిబుగ్గలోని రంగనాథస్వామి దేవాలయంలో ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో చండీహోమం వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు చండీహోమంలో పాల్గొని పూజలు చేశారు. పూజా కార్యక్రమంలో అధ్యక్షుడు వంగరి రవి, ప్రధాన కార్యదర్శి చిలుపూరి సురేష్, అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, రామాచార్యులు, సృజన, కవిత, సమ్మయ్య, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, రాజశేఖర్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

పసుపు నీటితో శ్వేతార్కుడికి అభిషేకం

కాజీపేట: కాజీపేట శ్వేతార్క మూలగణపతి దేవాలయంలో ఆలయ వ్యవస్థాపకుడు ఐనవోలు అనంత మల్లయ్యశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో స్వామి వారికి పసుపు సహస్రధారలతో గురువారం అభిషేకం నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అభిషేకాలు, అర్చనలతో పాటు ప్రత్యేక అలంకరణ పూజలు జరిపించారు. ఈ సందర్భంగా సిద్ధిబుద్ధి సమేత గణనాథుడి స్వామి ఉత్సవ విగ్రహాలను మాఢ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో రాధాకృష్ణశర్మ, సాయికృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శాంతియుత నిరసన

హసన్‌పర్తి: కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అరెస్ట్‌ను నిరసిస్తూ భారతీయ జనతాపార్టీ హసన్‌పర్తి శాఖ ఆధ్వర్యంలో నాయకులు గురువారం శాంతియుత నిరసన నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, బీజేపీ వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, డివిజన్ ప్రధాన కార్యదర్శి సుమన్, నాయకులు సాయికిరణ్, తాళ్ల రమేష్, దాసరి రాజు, దాది మధుసూదన్, సతీష్, బోస్, కళాశేఖర్, ఉప్పుల సురేందర్, పెద్దమ్మ కుమారస్వామి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ సంస్మరణ సభను విజయవంతం చేయాలి

కరీమాబాద్: ప్రజాయుద్ధ నౌక గద్దర్ సంస్మరణ సభను విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు మేకల మొగిలి పిలుపునిచ్చారు. శంభునిపేట సెంటర్‌లో సభ వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మొగిలి మాట్లాడుతూ ఖిలా వరంగల్ చమన్ సెంటర్‌లో ఈనెల 19న గద్దర్ సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. యాకయ్య, బాషబాక కొమ్మాలు, పల్లె రమేష్, కాశీం, ఉప్పునూతుల మహంకాళి, వేల్పుల యాకుబ్, గంధ్రతి వేణు తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఎజెండా అందజేత

హన్మకొండ: కాంగ్రెస్ పార్టీ ప్రకటించనున్న బీసీ డిక్లరేషన్‌లో పొందుపరిచేందుకు తాము రూపొందించిన నివేదికను అందించినట్లు బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు తెలిపారు. బీసీల అభివృద్ధి, సంక్షేమం కోసం రూపొందించిన 9అంశాలతో కూడిన నివేదికను హైదరాబాద్‌లో బీసీ డిక్లరేషన్ కన్వీనర్ కత్తి వెంకటస్వామిని కలిసి అందించారు.

వ్యాధులపై ప్రభుత్వ తీరు సిగ్గుచేటు

హన్మకొండ చౌరస్తా: నగరంలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి వ్యాధులు విజృంభిస్తున్నా చర్యలు చేపట్టకుండా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటని టీపీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ అర్శం అశోక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యాధుల బారినపడి ఆస్పత్రుల్లో చేరుతుంటే ప్రజల అవసరాలకు అనుగుణంగా వైద్య సహాయక చర్యలు చేపట్టకపోవడం శోచనీయమని పేర్కొన్నారు.

బోడగుట్టలో ఉచిత వైద్య శిబిరం

కాజీపేట రూరల్: కాజీపేట 47వ డివిజన్ బోడగుట్ట అర్బన్ హెల్త్ సెంటర్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరాలు వచ్చిన వారికి వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు, రాపిడ్ టెస్టులు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సంకు నర్సింగరావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జెరుష సృజన మాట్లాడుతూ వైరల్ ఫీవర్, డెంగ్యూ జ్వరాల నేపథ్యంలో బోడగుట్టలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

డిగ్రీ కళాశాలల అభివృద్ధికి సహకరించాలి

కేయూ క్యాంపస్: గ్రామీణ ప్రాంత డిగ్రీ కళాశాలల అభివృద్ధికి సహకరించాలని వర్ధన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోశయ్య కోరారు. ఈమేరకు కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్‌ను గురువారం కలిసి కోరారు.

పీఈటీల జోనల్ స్థాయి ఎన్నికలు

ఖిలా వరంగల్: వరంగల్ శంభుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో వరంగల్, ఖిలా వరంగల్ మండలాల ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్లు అధ్యక్షతన జోనల్ స్థాయి కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా జీహెచ్‌ఎస్ ఉర్సు పాఠశాల పీఈటీ మహ్మద్ సలార్‌ను జోనల్ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జమున, పర్వీన్, మాడి శెట్టి సుధాకర్, రమేష్ బాబు, పీఈటీలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ భగవానుడి ఊరేగింపు

హన్మకొండ: వెంకటేశ్వర కాలనీ, ఎన్జీవోస్ కాలనీల్లో శ్రీకృష్ణ భగవానుడిని భక్తిశ్రద్ధలతో గురువారం ఊరేగించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక జమ్మికుంట ఆధ్వర్యంలో కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని వెంకటేశ్వర కాలనీలో కృష్ణుని ప్రతిమను ప్రతిష్ఠించి గత 9రోజులుగా పూజా కార్యక్రమాలు నిర్వహించి గురువారం భగవద్గీత శ్లోకాలు పఠిస్తూ, జయ జయధ్వానాల మధ్య ఊరేగించారు.

11వ రోజుకు కాంట్రాక్టు లెక్చరర్ల రిలే నిరాహార దీక్షలు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ క్యాంపస్‌లోని పరిపాలన భవనం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 11వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో కుక్టా అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్, కాంట్రాక్టు అధ్యాపకులు డాక్టర్ బ్రహ్మయ్య, డాక్టర్ ఆశీర్వాదం, డాక్టర్ నాగయ్య, డాక్టర్ సతీష్‌కుమార్, శ్రీలత కూర్చున్నారు.

మార్గదర్శి సేవా సంఘం భవనం ప్రారంభం

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు కరీమాబాద్ గాంధీనగరంలోని మార్గదర్శి సేవా సంఘం వార్షికోత్సవం, నూతన భవన ప్రారంభోత్సవం గురువారం జరిగింది. ఎమ్మెల్యే నరేందర్ హాజరై భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. సమష్టి కృషి ఫలితంగా సంఘం అభివృద్ధి చెందిందని తెలిపారు.

ఎస్సారెస్పీ కాల్వలో పడి ఉపాధ్యాయుడి గల్లంతు

హసన్‌పర్తి: ఎస్సారెస్పీ కాల్వలోపడి యాదవనగర్‌కు చెందిన పైడిపాల రాజ్‌కుమార్ (51) అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు గల్లంతయ్యారు. ఈమేరకు బాధితుడి కుటుంబ సభ్యులు కేయూ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి అస్థి పంజరం లభ్యం

రామన్నపేట: పోతననగర్ శివారు పెద్ద మోరీలో గుర్తు తెలియని వ్యక్తి అస్థిపంజరం కొట్టుకువచ్చింది. దాన్ని మట్టివాడ పోలీసులు సేకరించి ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

ఇంజనీరింగ్ పితామహుడు 'విశ్వేశ్వరయ్య'

- నేడు ఆయన జయంతి సందర్భంగా 'ఇంజనీర్స్ డే'



వరంగల్: దేశం ఎంతోమంది త్యాగధనులు, శాస్త్రవేత్తలు, వైద్యులు, మేధావులు, ఇంజినీర్లకు జన్మనిచ్చింది. వారిలో ప్రముఖ సివిల్ ఇంజనీర్, రాజనీతిజ్ఞుడు సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 1861లో సెప్టెంబర్ 15న కర్నాటక రాష్ట్రంలోని మద్దనహళ్లి గ్రామంలో జన్మించారు. వారి పూర్వీకులు ఆంధ్రప్రదేశ్‌లోని మోక్షగుండం గ్రామానికి చెందిన వారుగా చెబుతారు. దేశానికి ఆయన చేసిన సేవలకు గాను భారత జాతి మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని 'ఇంజనీర్స్ డే' జరుపుకుంటోంది. ఆయన తన జీవిత కాలంలో అతి క్లిష్టమైన అనేక సాంకేతిక కట్టడాలకు రూపకల్పన చేసి వాటిని నిర్మించారు.

విశ్వేశ్వరయ్య సేవలు ఎనలేనివి



ఇంజనీర్‌గా సర్ రణగండి మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశానికి చేసిన సేవలు ఎనలేనివి. ఇంతటి మహానుభావుడి జయంతి సందర్భంగా తలుచుకోవటం మన విధి. ఇంజనీర్స్, భారత దేశ ప్రజల తరపున భారతరత్నకు నివాళులర్పిద్దాం.

- బండారు ధవళేశ్వర్‌రావు, రిటైర్డ్ ఈఈ (ఇరిగేషన్), ప్రొఫెసర్, వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల

పెన్షన్ పెంపుపై ఎల్ఐసీ ఉద్యోగుల హర్షం

హన్మకొండ: ఫ్యామిలీ పెన్షన్ 30శాతం సాధించుకున్న సందర్భంగా ఎల్ఐసీ ఉద్యోగులు బాలసముద్రంలోని ఎల్ఐసీ డివిజన్ కార్యాలయంలో గురువారం సంబరాలు జరుపుకున్నారు. వరంగల్ డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ సుబ్రమణ్యం పాల్గొని ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ జేఏసీ నాయకులు ప్రభాకర్, భాస్కర్, వెంకటరమణ మాట్లాడారు.